సామాన్యుడి ఆయుధం
# తెలంగాణ ప్రభ
డిజిటల్
గురువారం, ఏప్రిల్ 11, 2024





## వర్షాకాలం వచ్చే వరకు


# తాగునీటి సరఫరాను పర్యవేక్షించాలి

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశాలు

- నిరంతరాయంగా నీటి సరఫరా జరిగేలా అద్భుతమైన టీమ్ వర్క్ చేసినందుకు కలెక్టర్లకు అభినందన
- వేసవిలో నీటి ఎద్దడి నివారణకు కలెక్టర్ల వద్ద తగినన్ని నిధులు అందుబాటులో ఉంచినట్లు వెల్లడి
- మన ఊరు - మన బడి పనులు చేపట్టేందుకు ఈసీ అనుమతి ఇచ్చిందని వెల్లడి
- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టార్పాలిన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పిన సీఎస్

3 లో

2 లో



సుదూర తీరాలలో గల్ఫ్ దేశాలలో ఉన్న ప్రవాసీయులతో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి టి. జీవన్ రెడ్డి మంగళవారం రాత్రి జూమ్ యాప్, ఆన్ లైన్ వీడియో సమావేశంలో పాల్గొన్నారు. జీతేగా 'ఇండియా' - బనేగా భారత్ నినాదంతో... రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ఈ పార్లమెంటు ఎన్నికల్లో 'ఇండియా కూటమి' అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తున్న 'భారత్ జోడో అభియాన్' అనే పౌర సంఘాల జాతీయ వేదిక ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడారు.

- తెలంగాణ ప్రభ, (సిరిసిల్ల)

## పార్టీలకు అతీతంగా జీవన్‌రెడ్డికి
# గల్ఫ్ కార్మికుల మద్దతు

### గల్ఫ్ ప్రవాసులతో టి.జీవన్‌రెడ్డి ఆన్‌లైన్‌లో ఆత్మీయ సమావేశం

# మాహే.. రంజాన్

- దర్శనమిచ్చిన నెలవంక
- 30 రోజుల కఠోర ఉపవాస దీక్షలను విరమించుకున్న ముస్లింలు
- నేడు ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్)





## కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసిన నేవూరి

**తెలంగాణ ప్రభ (ఎల్లారెడ్డిపేట) :** తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని, రాష్ట్ర మాజీ సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షులు ఎల్లారెడ్డిపేట మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్ రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఎల్లారెడ్డిపేట మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్ రెడ్డి ఆయన సతీమణి మమతా వెంకట్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి ఇటీవల రాజీనామా చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరడానికి సీఎం రేవంత్ రెడ్డిని, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శివకుమార్, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్ రెడ్డి, అతని సతీమణి మమతా వెంకట్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, సిరిసిల్ల ముస్తాబాద్, గంభీరావుపేట, మండలాలకు చెందిన తన సన్నిహిత సహచరులైన వివిధ పార్టీల నాయకులను మాజీ సర్పంచులతో కలిసి పెద్ద ఎత్తున సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని నేవూరి వెంకటరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలుస్తోంది.

## సికింద్రాబాద్‌లో దుమాల వాసి బలవన్మరణం




**తెలంగాణ ప్రభ (ఎల్లారెడ్డిపేట):** ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన పాముల సాయితేజా ( 19 ) అనే యువకుడు మంగళవారం రాత్రి తన ఇంటిలో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు, దుమాల గ్రామానికి చెందిన కడు నిరుపేద కుటుంబానికి చెందిన పాముల వనిత గౌడ్ , భర్త సంతోష్ గౌడ్ . 8 సంవత్సరాల క్రితం మరణించడంతో బ్రతుకు దెరువు కోసమని సికింద్రాబాద్ లోని బోయిని పల్లి లో తన ముగ్గురు కుమారులు బన్నీ , సాయి తేజా , అరవింద్ లతో కలిసి అద్దె ఇంటిలో ఉంటుంది. బన్నీ ఫ్లిఫ్ కార్డు ప్రైవేట్ కంపెనీలో పని చేస్తుండగా సాయి తేజా అనారోగ్యంతో బాధపడుతున్నాడు ఆమె చిన్న కుమారుడు అరవింద్ హైదరాబాద్ లో ఐటిఐ చేస్తున్నాడు. మానసికంగా శరీరకంగా బాధపడుతున్న సాయి తేజా జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి అద్దె ఇంటి పై భాగానాఅంతస్తులో తాడుతో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సికింద్రాబాద్ బోయిన్పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు మృతదేహాన్ని స్వగ్రామ మైన దుమాల గ్రామానికి కుటుంబ సభ్యులు బంధుమిత్రులు తరలించి అంత్యక్రియలు సాయంత్రం వరకు నిర్వహిస్తామని స్థానిక గౌడ సంఘం ప్రతినిధులు తెలిపారు.

## పార్టీలకు అతీతంగా జీవన్‌రెడ్డికి

# గల్ఫ్ కార్మికుల మద్దతు

### గల్ఫ్ ప్రవాసులతో టి.జీవన్‌రెడ్డి ఆన్‌లైన్‌లో ఆత్మీయ సమావేశం



**తెలంగాణ ప్రభ, (సిరిసిల్ల) :** సుదూర తీరాలలో గల్ఫ్ దేశాలలో ఉన్న ప్రవాసీయులతో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి టి. జీవన్ రెడ్డి మంగళవారం రాత్రి జూమ్ యాప్, ఆన్ లైన్ వీడియో సమావేశంలో పాల్గొన్నారు. జీతేగా 'ఇండియా' – బనేగా భారత్ నినాదంతో... రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ఈ పార్లమెంటు ఎన్నికల్లో 'ఇండియా కూటమి' అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తున్న 'భారత్ జోడో అభియాన్' అనే పౌర సంఘాల జాతీయ వేదిక ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. సామాజిక ఉద్యమకారిణి కవిత కారుగంటి, వలస కార్మిక నేతలు స్వదేశ్ పరికిపండ్ల, మంద భీంరెడ్డి లు సమావేశ అనుసంధానకర్తలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా టి. జీవన్ రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లలో టీఆర్ఎస్ (బీఆర్ఎస్) ప్రభుత్వంలో ఆర్థిక మంత్రులుగా పనిచేసిన ఈటల రాజేందర్, టి. హరీష్ రావు లు గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని అన్నారు. ఏ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లోనే గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి చర్యలు చేపట్టారని అన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా గల్ఫ్ మృతులకు రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లింపును తమ ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. కోట్లాది రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించి పెడుతున్న గల్ఫ్ ఎన్నారై లను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని టి. జీవన్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ గల్ఫ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు సేవలను గల్ఫ్ దేశాలతో సహా మలేసియా, సింగపూర్ తదితర దేశాలలో పనిచేసే కార్మికులకు విస్తరిస్తామని, విదేశాల నుంచి వాపస్ వచ్చిన కార్మికుల పునరావాసం గురించి శ్రద్ధ తీసుకుంటామని అన్నారు. గల్ఫ్ ప్రవాసుల పిల్లలకు విద్యా సంస్థల అడ్మిషన్లలో కొన్ని సీట్లు కేటాయించాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. సమగ్ర ప్రవాసీ విధానం (ఎన్నారై పాలసీ) రూపొందిస్తామని జీవన్ రెడ్డి అన్నారు. సింగిరెడ్డి నరేష్ రెడ్డి, గుగ్గిల్ల రవిగౌడ్, కోటపాటి నరసింహా నాయుడు, ఖాజా నిజాముద్దీన్, గాజెంగి రంజిత్, అల్లె పాండురంగ, మ్యాకల రాజు, సయిండ్ల రాజిరెడ్డి, జక్కుల చంద్ర శేఖర్, నవీద్ దస్తగిరి, వడ్లకొండ గోవర్ధన్, భైర దేవ్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, బీరెల్లి తిరుమల్ రావు, సంతోష్ గౌడ్, తోట ధర్మేందర్, లక్కవత్తుల గంగాధర్, లక్ష్మణ్, సౌందర్య రామ్, యాతం స్వామి, రాజేష్, పల్క ఆనందం, ఎస్సీ రెడ్డి, మెంగు అనిల్, తేలు నరేష్, తొగర్ల సంజీవ్, జక్కుల ప్రసాద్, కంబాలపల్లి శాంత, పెంకుల రాజేశ్వర్, తేలు భాషా తదితరులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సౌదీ అరేబియా, యూఏఈ, ఓమాన్, కువైట్, ఖతార్, బహరేన్, సింగపూర్, మలేసియా దేశాలలోని తెలంగాణ ప్రవాసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. టి. జీవన్ రెడ్డి శాసన సభలో, శాసన మండలిలో గల్ఫ్ కార్మికుల గొంతుగా ఉన్నారని, నిజామాబాద్ ఎంపీగా గెలిచి జాతీయ స్థాయిలో పార్లమెంటులో తమ సమస్యలను లేవనెత్తాలని సమావేశంలో పాల్గొన్న పలువురు కోరారు.

# జ్ఞాపకాలే.. సంతకాలై..

- మహతిలో ఘనంగా 'సిగ్నేచర్స్ డే' సంబరాలు
- అనుబంధాలకు సాక్ష్యాలుగా విద్యార్థులు

**తెలంగాణ ప్రభ, (సిరిసిల్ల) :** ముచ్చటైన భవిష్యత్తు కోసం మూడేళ్ల డిగ్రీ కోర్సులో చేరిన విద్యార్థులు అందరూ తమ కళాశాలతో ఉన్న అనుబంధాన్ని ఒక్కసారిగా గుర్తు చేసుకుని తన్మయులయ్యారు. ఉన్నత విద్యాభ్యాస సమయంలో ఏర్పడిన కొత్త స్నేహాలు, వారితో కలిగిన గాఢమైన అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. తిరిగి రాని కాలాన్ని గుర్తు చేసుకుని స్నేహానికి గుర్తుగా తమ అంతరంగమే వేదికగా సాక్షి సంతకాలు చేసుకున్నారు. అపురూపమైన ఈ దృశ్యానికి పట్టణంలోని మహతి మహిళా డిగ్రీ కళాశాల వేదికగా మారింది. బుధవారం కళాశాల ప్రాంగణంలో ఫైనల్ ఇయర్ విద్యార్థులచే నిర్వహించిన 'సిగ్నేచర్ డే' సంబరాలు అంబరాన్ని తాకాయి. కళాశాలతో ముడిపడి ఉన్న జ్ఞాపకాలు, అనుభవాలు, అనుభూతులన్నింటికీ కలబోసుకుని సంబరాలను వైభవంగా జరుపుకున్నారు. తమ స్నేహానికి గుర్తుగా గ్రూప్ ఫోటోలు తీసుకున్నారు. సెల్ఫీలతో సందడి చేశారు. ఒకే రకమైన యునిఫాం వేసుకుని తమ స్నేహితులపై ఉన్న అభిప్రాయాలతో కూడిన కొటేషన్లు రాసి సంతకాలు చేసుకున్నారు. కలిసి విందు వినోదాల్లో మునిగి తేలారు. మరో భవిష్యత్తు కోసం తప్పని సరి పరిస్థితుల్లో విడిపోతున్నందుకు విచారిస్తూనే గురువుల ఆశీస్సులు అందుకున్నారు. మూడేళ్ల కాలంలో ముప్పయి ఏండ్ల భవిష్యత్తుకు సరిపడా జ్ఞానాన్ని అందించిన మహతి ప్రాంగణానికి, నిర్వాహకులకు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. నేర్చుకున్న జ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి. రాజు, ఫౌండర్ ప్రిన్సిపాల్ గెంట్యాల భూమేశ్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు తోట రాజేందర్, డి. రమేష్, డి. శ్రీలక్ష్మి , ఎన్. శరత్ బాబు, పి. శ్రీనివాస్, చంద్రశేఖర్ విద్యార్థులు పాల్గొన్నారు.





# వర్షాకాలం వచ్చే వరకు
# తాగునీటి సరఫరాను పర్యవేక్షించాలి

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశాలు







**తెలంగాణ ప్రభ, హైదరాబాద్ :**

వర్షాకాలం వచ్చే వరకు తాగునీటి సరఫరాను రోజూ పర్యవేక్షించాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. ఆమె బుధవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. తాగునీరు, ధాన్యం కొనుగోలు, పాఠశాలల్లో అత్యవసర నిర్వహణ పనులు, వేసవి చర్యలపై ఆమె సమీక్షించారు. రాష్ట్రంలో తాగునీటి పరిస్థితిని నిశితంగా పరిశీలించి, నిరంతరాయంగా నీటి సరఫరా జరిగేలా అద్భుతమైన టీమ్ వర్క్ చేసినందుకు కలెక్టర్లను అభినందించారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు కలెక్టర్ల వద్ద తగినన్ని నిధులు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. వర్షాకాలం ప్రారంభమయ్యే వరకు ప్రతిరోజూ పర్యవేక్షణ ఉండాలని సూచించారు.

**'మన ఊరు - మన బడి'**
**పనులు చేపట్టేందుకు అనుమతి**

మన ఊరు మన బడి పనులు చేపట్టేందుకు ఈసీ అనుమతి ఇచ్చింది. వడగాలుల తీవ్రతపై ప్రజలకు, సిబ్బందికి అవగాహన పెంచాలన్నారు. ప్రతి ఇంటికి సరిపడా నీటి సరఫరా ఉండేలా తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తాగునీటి పరిస్థితిని పర్యవేక్షించేందుకు నియమించిన ప్రత్యేక అధికారులు గ్రామాలను సందర్శించి నీటి సరఫరాలో జరుగుతున్న అంతరాయాల వివరాలను నేరుగా ప్రజల నుంచి అడిగి తెలుసుకోవాలన్నారు. వరి కొనుగోలు కేంద్రాలను తెలంగాణవ్యాప్తంగా ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ధాన్యం శుభ్రపరిచే యంత్రాలు, టార్పాలిన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాఠశాలల్లో అత్యవసరంగా చేపట్టాల్సిన మరమ్మతులకు సంబంధించి నిధులు విడుదలయ్యాయని తెలిపారు. పనులు ప్రారంభించేందుకు ఎన్నికల సంఘం నుంచి అవసరమైన అనుమతులు రావడంతో పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. తెలంగాణలో నెలకొన్న వేడిగాలులపై జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసి కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజరీ సిబ్బందికి అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఆరోగ్య సదుపాయాలను పెంచడంతోపాటు వేడిగాలులు ఎక్కువగా ఉన్న సమయంలో చేయకూడని పనులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.



## సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** కోటగిరి గ్రామ శివారు లో 120 ఎకరాల్లో సన్ ఫ్లవర్ సాగు చేయడం జరిగిందని రైతులు తెలిపారు. ప్రభుత్వం తరపున సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాల ని తహసిల్దార్‌కు, మండల వ్యవసాయ అధికారికి వినతిపత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ.. వడగళ్ల వాన కురవడంతో పండించిన సన్ ఫ్లవర్ నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగో లు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు శంకర్, హనుమాన్లు, గజేందర్, మాలకొండ రెడ్డి, సాయిలు, రమేష్, రాజు, గంగారం, శ్రీనివాస్, పి. సాయిలు పాల్గొన్నారు.




## చలివేంద్రం ప్రారంభం

**తెలంగాణ ప్రభ (ఎల్లారెడ్డిపేట) :** ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థంతో ఏర్పాటు చేసి తన ఔధార్యాన్ని చాటుకున్నాడు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం స్థానిక కొత్త బస్టాండ్ లో బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుబాయ్ ఈటిసి అధ్యక్షులు రాధారపు సత్యం చలివేంద్రాన్ని రాధారపు శంకర్, పయ్యావుల రామ చంద్రం, నంది కిషన్, సద్ది లక్ష్మారెడ్డి, ముత్యాల శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సత్యం సోదరుడు రాధారపు శంకర్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పయ్యావుల రామచంద్రం, క్యాబినెట్ మెంబర్ ముత్యాల శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు బండారి బాల్ రెడ్డి, డాక్టర్ అమరేందర్ రెడ్డి, రావుల లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఆలయ నిర్మాణానికి సిమెంట్ బస్తాలు ఇవ్వడానికి అంగీకారం

### అభినందించిన గ్రామస్తులు

**తెలంగాణ ప్రభ (ఎల్లారెడ్డిపేట) :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ రుక్మిణి సత్తిబామ సమేత శ్రీ వేణుగోపాల్ స్వామి ఆలయ నిర్మాణానికి కొండగట్టు బృందావన్ రిసార్ట్ యజమాని మర్రి పెల్లి కొండల్ రావు మాధవి దంపతులు ఒక లారీ లోడ్ సిమెంట్ బస్తాలు ఇవ్వడానికి ఆయన మంగళవారం అంగీకారం తెలుపుతూ భక్తుల ఎదుట బహిరంగంగా ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా కొండల్ రావు మాధవి దంపతులను గ్రామ పురోహితులు రాచర్ల కృష్ణ మూర్తి శర్మ, ఆలయ పూజారి నవీన్ చారిలు ఆశీర్వచనాలు అందించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు గడ్డం జితేందర్, ఉపాధ్యక్షులు గంట వెంకటేష్ గౌడ్ ప్రతినిధులు బండారి బాల్ రెడ్డి, వంగ గిరిధర్ రెడ్డి, మెగి నర్సయ్య ,పందిర్ల శ్రీనివాస్ గౌడ్ , పారి పెల్లి రాంరెడ్డి సనుగుల ఈశ్వర్, బందారపు బాల్ రెడ్డి లు భక్తులందరూ దంపతులను అభినందించారు.

# అందుబాటులో ఉండే
# అభ్యర్థులనే గెలిపించుకుందాం

### గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు
### గోగులపాటి కృష్ణమోహన్

**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మనకు ఎల్లవేళలా అందుబాటులో ఉండే వ్యక్తిని గెలిపించుకుంటే అభివృద్ధి సాధ్యమవుతుందని శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ అభిప్రాయపడ్డారు. మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గం నుండి స్వతంత్ర అభ్యర్థిగా వైష్ణవి క్యాటరింగ్ అధినేత పెండ్యాల శేష సాయి వర ప్రసాద్ (వైష్ణవి ప్రసాద్) బరిలో నిలుస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గోగులపాటి కృష్ణమోహన్ మాట్లాడుతూ ఏ అభ్యర్థి ఎప్పుడు ఏ పార్టీలో మారుతున్నాడు తెలియడం లేదని అలాగే ఏ పార్టీ ఎప్పుడు ఏ కోణంలో మునిగిపోతుందో కూడా అర్థం కావడం లేదని అందువల్ల మల్కాజ్గిరి పార్లమెంటు ప్రజలు మనకు అందుబాటులో ఉన్న వారిని గెలిపించుకుంటే స్థానికంగా అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. వైష్ణవి ప్రసాద్ సాధారణ మధ్యతరగతి కుటుంబానికి చెందిన వ్యక్తి వైష్ణవి కాత్రాల ద్వారా చక్కటి పేరు ప్రఖ్యాతలు ఉన్నాయని ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారని అలాంటి వ్యక్తిని గెలిపించుకున్నట్లైతే ఎల్లప్పుడు మనకు అందుబాటులో ఉండి మనకు ఎంతగానో ఉపయోగపడతారని ఆయన సంఘ సభ్యులకు సూచించారు. జనం కోసం జనని కోసం తపించే వ్యక్తి వైష్ణవి ప్రసాద్ అని కృష్ణమోహన్ అన్నారు.ఈ సందర్భంగా స్వతంత్ర అభ్యర్థి వైష్ణవి ప్రసాద్ మాట్లాడుతూ సామాన్యుడు యాచించే స్థాయి నుండి శాసించే స్థాయికి ఎదగాలని, తనకు స్థానిక సమస్యలపట్ల పూర్తి అవగాహన ఉందని, తనను గెలిపిస్తే భూకబ్జాలను నిలువరించి, సాధారణ ప్రజానీకానికి మెరుగైన సేవలు చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వాసవి ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు దారం ఇంద్రసేన గుప్త, ప్రభాకర్ గుప్త, శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ముఖ్య సలహాదారులు రమేష్ సర్వేపల్లి, రాంబాబు, సంజీవరావు, సుబ్రహ్మణ్యం, హరి రాఘవేంద్ర ప్రభృతులు తదితరులు పాల్గొన్నారు.






## నిత్యవసర సరుకులు అందజేత

**తెలంగాణ ప్రభ (ఎల్లారెడ్డిపేట) :** మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన ఎన్నారై మండల అధ్యక్షు లు, కాంగ్రెస్ నాయకులు అయినటువంటి మహ మ్మద్ లాలా ప్రస్తుతం సౌదీలో ఉంటూ.. 20 నిరుపేద కుటుంబాలకు రంజాన్ కానుకగా నిత్యవసర సరుకులు తన మిత్రుడు అయినటువంటి బెస్త నరేష్, పెరియర్ రామస్వామి ద్వారా అందించడం జరిగింది.



## చలివేంద్రం ప్రారంభం

**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** షాపూర్ నగర్ హమాలి సంఘం కార్మికులు షాపూర్ నగర్ అడ్డ వద్ద ఏర్పాటు చేసిన చేసిన చలివేంద్రాన్ని నేడు ఏఐటీయూసీ,సీఐటీయూ నాయకులతో కలిసి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కార్మికులే కలిసి ఎండాకాలంలో ప్రజల దాహార్తి తీర్చడానికి స్వచ్ఛందంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చెయ్యడం మంచి పనని ఇలాగే అందరు కలిసి మెలిసి ఒకరికొకరు సహకరించుకోవడం వల్ల మంచి వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్, సీపీఎం కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ హమాలి కార్మికులు ఒక కుటుంబంగా జీవిస్తూ,తమ సంపాదనలో చేతనైనంత సహాయం ఇతరులకు చెయ్యడం ఒక గొప్ప విషయం అని ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం చేసి ఆపదలో ఉన్నవారికి సహాయం చెయ్యడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు స్వామి, సీఐటీయూ నాయకులు దేవదానం,ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాస్, డీ వై ఎఫ్ ఐ నాయకులు అంజయ్య, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు నర్సింహా రెడ్డి, మహేందర్, శ్రీనివాస్, జార్జ్,చంద్రమౌళి, మహేందర్, గురప్ప, యాగంటి,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## యాద్గర్‌పూర్‌లో కుస్తీ పోటీలు

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** కోటగిరి మండల పరిధిలోని యాద్గర్ పూర్ గ్రామంలో ఉగాది పండుగను గ్రామంలోని పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి కొత్త పంచాంగాన్ని పంతుల చేత పంచాంగ శ్రావణం చేపట్టారు. గ్రామస్తులందరూ కలిసి చూసుకోవడం జరిగింది. అనంతరం ఉగాది పండగను పురస్కరించుకొని గ్రామస్తుల ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలో తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక నుండి మల్లయోధులు కుస్తీ పోటీలో పాల్గొని గ్రామస్తులకు ఆనందింపజేశారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు కుస్తీ పోటీలను చూసి ఉత్సాహంలో మునిగిపోయారు. ప్రతి సంవత్సరం ఉగాది పండుగను సందర్భంగా గ్రామంలో కుస్తీ పోటీలను నిర్వహిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కుస్తీ పోటీల్లో ఆయా గ్రామాల మల్లయోధులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఫుల్కంటి కిష్టయ్య, సాయ గౌడ్ ముత్తయ్య, మీర్జాపూర్ చిన్న సాయన్న, హుస్సేన్ ,సాయిలు మైతాబ్, దాదు మున్వర్ సంజీవయ్య, రాజయ్య, గౌస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు నైట్ డ్యూటీలు కాదు..

# పిల్లలపై మానసిక ఒత్తిడి తగ్గించండి

### -టీఎస్ యూటీఎఫ్

### రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ



**తెలంగాణ ప్రభ, (సిరిసిల్ల) :** గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలతో అప్రమత్తమైన సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి నైట్ డ్యూటీ ఉపాధ్యాయుల సంఖ్యను రెండు నుండి నాలుగుకు పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చారు. ఉపాధ్యాయులు వంతుల వారీగా రాత్రి కాపలా కాయాలని ఉత్తర్వుల్లో పేర్కొనటాన్ని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) తీవ్రంగా ఖండిస్తున్నది. గురుకుల ఉపాధ్యాయులను రాత్రి కాపలాదారు స్థాయికి దిగజార్చడం తీవ్ర అభ్యంతరకరం. విద్యార్థుల ఆత్మహత్యలకు వారిపై పెరిగిన మానసిక ఒత్తిడి కారణం. ఆ అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండా వింతైన ఉత్తర్వులు ఇవ్వటం సమంజసం కాదు. ఇంటర్, పదవ తరగతిలో ఉత్తమమైన ఫలితాల పేరిట విద్యార్థులను కార్పొరేట్ విద్యాసంస్థల తరహాలో వత్తిడికి గురిచేస్తూ మానసిక ప్రశాంతత లేకుండా చేస్తున్నారు. ఆ కారణంగానే కార్పొరేట్ విద్యాసంస్థలకు పరిమితమైన ఆత్మహత్యలు గురుకుల విద్యాసంస్థలకు పాకినాయి. వీటికి కారణాలను అధ్యయనం చేసి, నివారణ కోసం శాస్త్రీయమైన చర్యలు చేపట్టటానికి మానసిక నిపుణులతో కూడిన అధ్యయన కమిటీని నియమించాలని టిఎస్ యుటిఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు పాకాల శంకర్ గౌడ్ డిమాండ్ చేశారు. అత్యధిక గురుకుల పాఠశాలలు అద్దె భవనాల్లో నిర్వహిస్తూ విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించటంలో వైఫల్యం ఉంది. మెస్ చార్జీలు పెంచుతామని చెప్పి రెండేళ్ళు గడిచినా జిఒ ఇవ్వలేదు. ఎండలను తట్టుకోవడానికి విద్యార్థులకు పుచ్చకాయలు, చల్లని మజ్జిగ, చల్లని నీరు, అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కానీ అదనపు బడ్జెట్ ఇవ్వకుండా ఎలా సాధ్యమో అధికారులే చెప్పాలి. ఉపాధ్యాయులపై ఇప్పటికే బోధనేతర పనుల భారం అధికంగా ఉంది. ఇప్పుడు రాత్రి డ్యూటీలో ఉండే ఉపాధ్యాయుల సంఖ్యను పెంచడం ద్వారా వారిపై వత్తిడి మరింత పెరుగుతుంది. కనుక ఉపాధ్యాయులను నైట్ వాచ్ మన్ లు గా మార్చకండి. విద్యార్థులపై మానసిక వత్తిడిని తగ్గించి ఆహ్లాదకర వాతావరణంలో చదువుకునే విధంగా ప్రోత్సహించాలని టిఎస్ యుటిఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్ రావు,ఉపాధ్యక్షులు రమేష్,కోశాధికారి రవీందర్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఆలయ నిర్మాణానికి విరాళాలు సేకరించాలి

**తెలంగాణ ప్రభ (ఎల్లారెడ్డిపేట) :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం నిర్మాణానికి విరాళాలు సేకరించాలని రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయ కమిటీ తీర్మానం చేసింది. ఆలయ కమిటీ అధ్యక్షులు గడ్డం జితేందర్ అధ్యక్షతన ఆలయంలో కమిటీ సభ్యులు సమావేశమై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకొని వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డ వారి ద్వారా ఆలయ నిర్మాణానికి విరాళాలు ఆలయ కమిటీ సభ్యులందరు కలిసి సేకరించాలని తీర్మానించారు. శ్రీరుక్మిణి, సత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో ఎవరైనా పుట్టిన రోజు పెళ్లి రోజులు సందర్భంగా ఆశీర్వచనం చేసే స్వామివారి చిత్రపటం అందించి పురోహితులు ఆశీర్వచనం చేయాలని తద్వారా విధానాలు సేకరించాలని నిర్ణయించారు. దుబాయ్, మస్కట్, సౌదీ అరేబియా గల్ఫ్ దేశాల్లో స్థిరపడిన వారి ద్వారా విరాళా లు సేకరించాలి వివిధ వ్యాపార సముదాయాల యజమానులు ద్వారా విరాళాలు సేకరించాలని తీర్మానం చేశారు. శ్రీవేణుగోపాల్ స్వామి రథోత్సవం సందర్భంగా లడ్డు, కొబ్బరి కాయ వేలంలో పాల్గొనే వారు. అదే రోజు డబ్బులు చెల్లించె విధంగా కమిటీకి సహకరించాలనీ కోరారు. సమావేశంలో ఆలయ పూజారి నవీన్ చారి, ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు గంట వెంకటేష్ గౌడ్, బండారి బాల్ రెడ్డి, మెలిగి నర్సయ్య, సంతోష్ , ఓగ్గు బాలరాజ్ యాదవ్, వంగ గిరిధర్ రెడ్డి పందిళ్ళ శ్రీనివాస్ గౌడ్, నల్లనాగుల రామాచారి, కిష్టయ్య, చందనం శంకర్, బ్రహ్మాచారి, తోట బాలయ్య పాల్గొన్నారు.





## రంజాన్ తోఫా పంపిణీ

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** కోటగిరి మండల కేంద్రంలోని చావడిగల్లికి చెందిన పేద మైనార్టీ ఫకీర్ కుటుంబాలకు 30 మందికి మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మాజీ మండల కోఆప్షన్ మెంబర్ హకీమ్ రంజాన్ పండుగను పురస్కరించుకొని మైనార్టీ మహిళలకు ఒక్కొక్కరికి 850 రూపాయల చొప్పున నిత్యావసర సరుకులతో పాటు రంజాన్ తోపాలను అందజేశారు. ఎంపీటీసీ కొట్టం మనోహర్ షాహిద్ హుస్సేన్ మాట్లాడుతూ... పేద కుటుంబాలకు రంజాన్ పండగ తోపాలను అందజేసి నిరుపేద కుటుంబ ఆదుకున్నందుకు అతని సహాయ సహకారాలు ఎప్పుడూ మరువలేమని అన్నారు. కోటగిరి మండల చావుడిగల్లి తరఫున ఆయనకు వారి కుటుంబానికి భగవంతుని ఆశీర్వాదాలు ఎల్లప్పుడు ఉండాలని కోరుకుంటూ ముందుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ ధన్యవాదాలు తెలిపారు. దసరా పండగ మాసంలో హిందూ బంధువులందరికీ తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హకీమ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షాహిద్ హుస్సేన్, ఎంపిటిసి కొట్టం మనోహర్, బర్ల మధు,ఎజాజ్ ఖాన్, యూత్ అధ్యక్షులు అబ్దుల్ వాజీ, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నజీర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చెట్లు నరికితే కఠిన చర్యలు

హెచ్ఎంటీ అడవి ప్రాంతంలో అక్రమంగా చెట్లు నరుకుతున్నారని ట్విట్టర్ ఫిర్యాదు సమాచారంతో ఐఎఫ్ఎస్ పీసీసీఎఫ్ డబ్ల్యూఎల్ సీడబ్ల్యూఎల్ డబ్ల్యూ (ఎఫ్ సిఏ) (ఎఫ్ఏసి) ఫారెస్ట్ అధికారి మోహన్ చంద్ర మంగళవారం అటవీ ప్రాంతంలో పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్రమంగా చెట్లు నరికితే, చట్టపైనమైన చర్యలు తీసుకొని ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తి లేదని అన్నారు. భవిష్యత్తులో ఎవరైనా ఇలాంటి అక్రమాలకు పాల్పడితే వెంటనే ఫిర్యాదు చేయాలని స్థానికులకు సూచించారు. రాబోయే రోజులు తగిన జాగ్రత్తలు తీసుకొని చెట్ల నరికివేతను అడ్డుకుంటామని తెలిపారు.

- తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్)



# మాషా.. రంజాన్

- దర్శనమిచ్చిన నెలవంక
- 30 రోజుల కఠోర ఉపవాస దీక్షలను విరమించుకున్న ముస్లింలు
- నేడు ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్)
- ఇస్లాం సంప్రదాయ లోగిళ్ళలో వెల్లివిరిసిన ఆనందం
- ప్రార్థనలకు ముస్తాబైన ఈద్గాలు, మసీదులు...



నెలవంక దర్శనమిచ్చింది. ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే రంజాన్ పండుగ (ఈద్–ఉల్–ఫితర్) వేడుకలను నేడు గురువారం ఘనంగా జరుపుకొనున్నారు. బుధవారం రాత్రి నెలవంక దర్శనం కావడంతో ఇస్లాం సాంప్రదాయ లోగిళ్ళలో ఆనందం వెల్లివిరిసింది. నెలవంక పొడుపుతో ప్రారంభమైన ఉపవాస దీక్షలు... మళ్లీ నెలవంక దర్శనం ఇచ్చేవరకు అంతే (30 రోజులు) నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు బుధవారం సాయంత్రం నెలవంకను చూసి స్థానిక మసీదులలో తమ కఠోర ఉపవాస దీక్షలను విరమించుకున్నారు. ముస్లింలు అత్యంత వైభవంగా జరుపుకునే పండుగలలో రంజాన్ అతిపెద్ద పండుగ. మహమ్మద్ ప్రవక్త దేవదూతగా ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించిన సందర్భమే రంజాన్. దీన్ని ఆయన ఖురాన్ రూపంలో పవిత్రంగా అందజేశారని ఇస్లామీలు చెబుతారు. రంజాన్ సందర్భంగా ముస్లింలు నిర్వహించే ప్రత్యేక ప్రార్థనల కోసం ఇప్పటికే జిల్లాలోని నగరాలు, పట్టణాలు, మండలాలు, గ్రామాల్లోని ఈద్గాలు, మసీదులు ముస్తాబై సిద్ధంగా ఉన్నాయి. ఈ సందర్భంగా రంజాన్ పండుగ ప్రత్యేకత గురించి ప్రత్యేక కథనం..

### పరమ పవిత్ర మాసం రంజాన్

నింగికి నేలకు నిచ్చెన వేసే నెలవంక పొడుపుతో ప్రారంభమైన రంజాన్ మాసం ముస్లింలకు అత్యంత ప్రీతిపాత్రమైంది. అత్తరు సువాసనలు, ఆత్మీయ ఆలింగనాలు, ఖీర్ సేమియాల తీయదనం, హరీస్, హలీంల ఘుటుతనం, బిర్యానీ పలావుల గుమగుమల అపూర్వ సంగమమే రంజాన్. అత్యంత నిష్టతతో కఠోర క్రమశిక్షణతో ఉపవాసాలు చేస్తూ పండుగ ముందు గడిచిన 30 రోజుల విశిష్ట మాసమే రంజాన్. ప్రతి ముస్లిం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే పరమ పవిత్ర మాసమే రంజాన్ గా చెప్పుకోవచ్చు. ఉపవాసాలు ఉన్న నెలరోజులపాటు ముస్లింల ఇళ్లలో పండుగ వాతావరణమే. 30 రోజుల పండుగను నిర్వహించుకునే ఏకైక మతస్థులు ముస్లిం సోదరి సోదరులు. పొద్దంతా ఉపవాసం ఉండి పొద్దు గడిచాక ఇంటిల్లిపాది ఒక చోటుకు చేరి బంతి భోజనాలు చేయడం మరువలేని అనుభూతి అని ముస్లిం పెద్దలు చెబుతున్నారు.

### ఈద్-ఉల్-ఫితర్...

30 రోజుల ఉపవాస దీక్షల ఉపసంహరణ ఈద్–ఉల్–ఫితర్. అల్లా దేవుడు చెప్పిన కఠోర పరీక్షలను ఎదుర్కొని నీతి, నియమాలను ఆచరిస్తూ నిండైన ఆత్మ విశ్వాసంతో హరి అరివిరిసిన ఆనందంతో జరుపుకునేదే ఈద్–ఉల్–ఫితర్ పర్వదినం. రంజాన్ పండుగ నాడు ఎంత పేదవారైనా కొత్త దుస్తులు ధరించి అత్తరు సుర్మాలు పులుముకుని ఈద్గాలలో, మసీదులలో జరిగే ప్రార్ధనల్లో పాల్గొంటారు. అక్కడ మత పెద్దలు వినిపించే ఖుత్బాను భక్తిశ్రద్ధలతో విని జీవితం సుఖ సంతోషాలతో గడిచేలా చూడమని తమ ఆరాధ్య దైవమైన అల్లాను నమాజ్ (ప్రార్థన) ద్వారా వేడుకుంటారు. నమాజ్ అనంతరం ఈద్ ముబారక్ అంటూ ఆత్మీయ ఆలింగనాలు చేసుకొని ఒకరినొకరు కలుసుకొని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటారు. ఈ సందర్భంలోనే మాటలు మానుకున్నా ఒక్క అలింగనంతోనే దగ్గర అయిపోతారు. కుల, మత, భేదం లేకుండా స్నేహితులను తమ ఇళ్ళలోకి ఆహ్వానించి సేమియా పాయసంను వడ్డించి బిర్యానీ గుమగుమలను రుచి చూపిస్తారు.

### ఉపవాస దీక్షలు ఎందుకు?

ఈ రంజాన్ మాసంలో దీక్షలు పాటించి మనస్ఫూర్తిగా ప్రార్థనలు చేసిన వారి కోరికలను అల్లా తీరుస్తాడని ముస్లింల ప్రగాఢ విశ్వాసం. 30 రోజులపాటు కఠోర ఉపవాస దీక్షలను నియమ నిష్ఠలతో మూడు భాగాలుగా విభజించి వాటికి ప్రాధాన్యత కల్పించారు. మొదటి పది రోజుల్లో దీక్షలు పాటిస్తే అల్లా కరుణ వర్షాన్ని కురిపిస్తాడని, 10 నుండి 20 రోజుల దీక్షలు పాటిస్తే చేసిన పాపాలను హరిస్తాడని, మిగిలిన 10 రోజుల దీక్షలను పూర్తి చేస్తే నరకం నుంచి ఉపసంహరణ లభిస్తుందని ముస్లింలు భావిస్తారు. ఈ దీక్షలో 27వ రోజు రాత్రి షబే ఖదర్ పేరిట మసీదుల్లో జరిగే ప్రత్యేక ప్రార్థనకు ఒక ప్రత్యేకత ఉంటుంది.



### రోజా (ఉపవాసం) ప్రత్యేకత

రంజాన్ లో ప్రతి ముస్లిం తప్పనిసరిగా రోజా (ఉపవాసం) పాటిస్తారు. సూర్యోదయం కంటే ముందు వేకువ జామున 3 గంటల నుంచి 5 గంటల లోపు సహార్ పేరిట భోజనాలు పూర్తి చేస్తారు. సాయంత్రం సూర్యాస్తమయం వరకు నిష్టగా ఉపవాసం ఉంటారు. ఫజర్, జొహార్, అసర్, మగ్రిబ్, ఇషా.. ఇలా ఐదుసార్లు నమాజ్ చదవడంతో పాటు అల్లాను ప్రసన్నం చేసేందుకు ఖురాన్ పటనం చేస్తారు. తరావి పేరిట 26 రోజులపాటు ఖురాన్ లోని సూక్తులను నేర్చుకున్న హాఫీజ్ (మత గురువు) నమాజ్ లో చదువుతారు. సూర్యాస్తమయం సమయంలో సాయంత్రం మగ్రిబ్ నమాజ్ కంటే ముందు ఇఫ్తార్ ను చేసి ఉపవాస దీక్షను విరమిస్తారు. రంజాన్ ఉపవాసంను విధిగా పాటించాలన్న దయామయుడైన అల్లా కొన్ని మినహాయింపులను ప్రసాదించారు. చిన్నపిల్లలు, వృద్ధులు, బాటసారులు, వ్యాధిగ్రస్తులు, గర్భవతులు, బాలింతలు, మతిస్థిమితం లేని వారికి మినహాయింపు ఇవ్వడం విశేషం.

### జకాత్...

జకాత్ అంటే దానధర్మాలు చేయడం. ఇస్లాం మతాన్ని ఆచరించే ప్రతి వ్యక్తి తన వార్షిక ఆదాయంలో 2.5 శాతం దీనులకు, పేదలకు, ఆపదలో ఉన్న వాళ్లకు ఖర్చు చేయాలి. ఈ జకాత్ ను గనుక రంజాన్ మాసంలో చేసినట్లయితే 70 శాతం అధిక పుణ్యం లభిస్తుందని ముస్లింల ప్రగాఢ విశ్వాసం. ఒకప్పుడు జకాత్ అనేది ఆహారం, దుస్తుల రూపంలో ఉన్న ఇప్పుడు నగదును కూడా జకాత్ రూపంలో ఇస్తూ పేద వాళ్లను ఆదుకుంటున్నారు. జకాత్ ఇవ్వడానికి ధనవంతులే కానవసరం లేదు. చిల్లి గవ్వ చేతిలో లేకున్నా సాటి మనిషిని చిరునవ్వుతో పలకరించిన జకాతే అవుతుందని ముస్లిం మత పెద్దలు చెబుతున్నారు.

### జకాత్ కు అర్హతలు ఇవే

జకాత్ ను ఎవరు పడితే వారు తీసుకోకూడదు. తీసుకోరు కూడా. అలాగని ఎవరికి పడితే వారికి జకాత్ ఇవ్వరు. అర్హులను గుర్తించి దీనిని చెల్లిస్తారు. మరి ఇంతకీ హక్కుదారులు ఎవరంటే.. పేదలు, నిరుపేదలు, అనాధలు, వితంతువులు, ఫకీర్లు, బాటసారులు, మదర్సాలు, దైవ మార్గంలో ఉన్నవారు, పేద ఆడపిల్లల వివాహం కోసం, తిండి లేక ఆకలితో అలమటించే వాళ్ళు, జైలు శిక్ష అనుభవించే ఖైదీని విడిపించడం కోసం చేసే ప్రయత్నం.

### జకాత్‌కు అనర్హులు..

జకాత్ ఇచ్చేవాళ్ళు ఎవరైనా కావచ్చు. తమ రక్త సంబంధీకులకు వీటిని చెల్లించకూడదు. అంటే కొడుకులు, కూతుళ్లు, తల్లిదండ్రులు, అమ్మమ్మ, నాయనమ్మ, తాతయ్య, మనుమలు, మనమరాళ్లు అనర్హులు. బంధువుల్లో ఎవరైనా అర్హులు ఉంటే జకాత్ ఇవ్వచ్చు. అక్రమ పద్ధతుల్లో సంపాదించిన సొమ్ముతో చేసే జకాత్ పరిగణలోకి రాదు.



మహ్మద్ అబ్దుల్ వహీద్
సీనియర్ జర్నలిస్టు
+91 94412 87166